## క్లుప్తంగా

### అవకతవకలు లేకుండా జాగ్రత్తలు

చిల్లకూరు: ఉపాధి పనుల్లో అవకతవకలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఓ గిరిబాబు ఆదేశించారు. మండల ఉపాధి కార్యాలయంలో బుధవారం మండలంలోని అన్ని పంచాయతీలకు చెందిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రచారాలు, ఓటర్లను ప్రభావితం చేసేలా మాట్లాడడం జరిగితే వారిని విధుల నుంచి తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో జేఈ మల్లికార్జున్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలు పాల్గొన్నారు.

### సాంకేతిక అంశాలపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న అధికారులు

గూడూరురూరల్: ఉపాధి పథకం ద్వారా అసెట్ బేస్డ్ ప్రయారిటీ వర్క్ కింద రైతుల పొలాల్లో చేపడుతున్న ఫారం పాండ్‌ల నిర్మాణంలో సాంకేతిక అంశాల ఆధారంగా చక్కగా నిర్మించవచ్చని జీఐఎస్ సెక్షన్ అధికారులు సూచించారు. మండలంలోని తిరువెంగళాయపల్లిలో మూలి ప్రమీల అనే రైతు పొలంలో చేపట్టిన ఫారం పాండ్‌ను బుధవారం సీఆర్‌డీ, డ్వామా జీఐఎస్ సెక్షన్‌ల నుంచి వచ్చిన అధికారులు సునీల్, గుణశేఖర్ పరిశీలించారు. ఈ ఫారం పాండ్‌ను మోడల్‌గా తీసుకుని సీఆర్‌డీకి పంపించారు. అనంతరం గూడూరు, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి క్లస్టర్ పరిధిలోని ఈసీలు, జేఈలకు సాంకేతిక అంశాలపై ఫీల్డ్ శిక్షణ ఇచ్చారు. గూడూరు క్లస్టర్ ఏపీడీ వరప్రసాద్, ఎంపీడీఓ రాజశేఖరరావు, ఉపాధి ఏపీఓ పెంచలయ్య, టీఏలు యోగేష్, కోటేశ్వరరావు, జయచంద్ర, జేఈ వెంకటేశ్వర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ హజరత్ పాల్గొన్నారు.

### ఓల్టేజీ సమస్య లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లు

సూళ్లూరుపేట : పట్టణంలో లో ఓల్టేజీ సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి కొత్తగా అధిక సామర్థ్యం కలిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు పట్టణ ఏఈ వెంకటస్వామి తెలిపారు. పట్టణంలోని గాంధీ మందిరం, అమరా గార్డెన్, ఎస్వీటీ థియేటర్ వీధి ప్రాంతాల్లో తరచూ లో ఓల్టేజీ సమస్యలు వస్తున్నాయన్నారు. దీంతో ఎస్వీటీ థియేటర్ వీధిలో కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్‌లను బుధవారం ఏర్పాటు చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

### సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి



దగ్గవోలులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

దక్కిలి: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. దగ్గవోలు, పాతనాలపాడు, లింగసముద్రం సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా వివాదాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజేష్, వీఆర్వో మోహన్, పంచాయతీ కార్యదర్శి శిరీష, విలేజ్ సర్వేయర్ శ్రీనువాసులు పాల్గొన్నారు.

### కండలేరులో 8.229 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం 8.229 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 250 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్ కు 10, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ నాంచారయ్య

ఓజిలి: వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడికి నివారణ చర్యలు చేపట్టాలని తహసీల్దార్ నాంచారయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమన్‌రెడ్డి, ఈఓపీఆర్డీ మోహన్ పాల్గొన్నారు.

### వైభవంగా విగ్రహ ప్రతిష్ట



హోమం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

సైదాపురం: మండలంలోని రాజుఎరుగుంటపాళెం –అక్కమాంబపురం గ్రామ సమీపంలో నిర్మించిన వీరభద్రస్వామి దేవస్థానంలో నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# జగనన్న పాలనలోనే ఆర్థికాభివృద్ధి

- వైఎస్సార్‌సీపీని అఖండ మెజారిటీతో గెలిపించండి
- గూడూరులో మేరిగ మురళీధర్ ఇంటింటి ప్రచారం



సనత్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మేరిగ మురళీధర్

గూడూరురూరల్: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు ఆర్థికాభివృద్ధి జరిగిందని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ అన్నారు. పట్టణంలోని 4వ వార్డు పరిధిలోని సనత్ నగర్‌లో బుధవారం నేతలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన మేలును వివరిస్తూ మీ ఇంటి బిడ్డగా ఉన్న తనను రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. స్థానికులు మేరిగ మురళీధర్‌కు ఘనస్వాగతం పలికారు. మేరిగ మురళీధర్ మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గూడూరు మరింతగా అభివృద్ధి చెందాలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గూడూరు ఎంపీపీ బూదూరు గురవయ్య, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు, 24 సొసైటీ అధ్యక్షుడు అట్ల శ్రీనివాసులురెడ్డి, నేతలు నాసిన నాగులు, సతీష్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు గిరిబాబు, తాళ్లూరు శ్రీనివాసులు, కృష్ణప్రసాద్‌రెడ్డి, అన్నం మురళి, కోదండరామయ్య, సాయి, హషీమ్, పూర్ణచంద్ర, అశోక్, షేక్‌బాబు, అల్తాఫ్, కరిముల్లా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# మీకు గౌరవం ఇచ్చింది వైఎస్సార్‌సీపీనే

- వలంటీర్‌లపై దిగజారుడు మాటలు సరికాదు
- పాశం, వరప్రసాద్‌రావుపై మేరిగ మండిపాటు




మాట్లాడుతున్న మేరిగ మురళీధర్

గూడూరురూరల్: టీడీపీ, ప్రజారాజ్యం పార్టీలో ఉన్న మీకు ప్రాధాన్యత ఇచ్చి గౌరవంగా ఎమ్మెల్యే స్థానాలను కట్టబెట్టిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని, అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని గూడూరు టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్, బీజేపీ తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌రావు విమర్శించడం గురువింద సామెతను గుర్తు చేస్తోందని వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ అభ్యర్థి మేరిగ మురళీధర్ బుధవారం అన్నారు. రెండు రోజుల క్రితం బీజేపీలో చేరిన వెలగపల్లి వరప్రసాద్‌రావు, టీడీపీ కార్యాలయంలో పాశం సునీల్‌కుమార్‌తో కలిసిన సమయంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడంపై ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. ఇద్దరు చెరొక పార్టీలో ఉండి ఎమ్మెల్యే, ఎంపీల స్థానాల కోసం వెంపర్లాడుతున్న సమయంలో ఇద్దరిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అక్కున చేర్చుకుని మీకు టికెట్లు ఇచ్చి రాజకీయ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన విషయం మరచి ఏరు దాటాక తెప్ప తగలేసే రకంగా విమర్శలు చేస్తారా అని ప్రశ్నించారు. గూడూరు ఎమ్మెల్యేగా గెలిచి పార్టీకి ద్రోహం చేసి టీడీపీలో చేరిన తరువాత ప్రజలు తగిన బుద్ధిచెప్పారని అన్నారు. అలాగే వరప్రసాద్‌రావు ఒంటెద్దు పోకడతో పార్టీ శ్రేణులు ఇబ్బంది పడుతుంటే ఏడాదిగా తీరు మార్చుకోవాలని పార్టీ అధినేత హెచ్చరిస్తున్నప్పటికీ మార్పు లేక పోవడం, ప్రజల్లో మన్ననలు పొందలేక పోవడంతోనే గూడూరు ఎమ్మెల్యే టికెట్ నిరాకరించారని అన్నారు. వైఎస్సార్‌సీపీలో ఉన్న సమయంలో రూ.100కోట్లు చంద్రబాబు ఆఫర్ ఇచ్చిన దుర్మార్గుడు అని పదేపదే చెప్పిన వరప్రసాద్‌రావు ఇప్పుడు బీజేపీలో చేరడంతోనే అలాంటి విమర్శలు మరచి ఆయనను హత్తుకుని గెలిపించుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపు నివ్వడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో గూడూరు నియోజకవర్గంలోకి వచ్చిన సమయంలో వరప్రసాద్‌రావును కలెక్షన్ ప్రసాద్ నీ పేరు రెడ్‌బుక్‌లో ఉందని చెప్పిన మీ నాయకుడు ఇప్పుడు ఆయన్ను స్వాగతించడం ఎంత వరకు సబబని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సేవ చేసేలా ఏర్పాటు చేసిన వలంటీర్‌లను రెండు నాలుకల ధోరణిలో టీడీపీ నాయకులు విమర్శించడం సరికాదన్నారు. టీడీపీ అధినేత వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని ఒక దగ్గర చెబుతారు, మరో చోట దిగజారుడు మాటలు అని వారి మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్నారని అన్నారు. మరి దత్త పుత్రుడు పవన్ కల్యాణ్ పూనకం వచ్చిన వాడిలా వలంటీర్లపై తిట్ల దండకం చేస్తున్నారని వలంటీర్‌లను సంఘ విద్రోహ శక్తులు అని సంబోధించడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ పాణకా దేవసేనమ్మ, పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు, నాసిన నాగులు, మాజీ కౌన్సిలర్లు తాళ్లూరు శ్రీనివాసులు, వెంకటశ్వర్లు, క్రిష్ణప్రసాద్‌రెడ్డి, మండ్ల రాజేష్, రాఘవరెడ్డి, అన్నం మురళి, అల్తాఫ్, షేక్ బాబు, పెంచలయ్య, జలీల్, కోదండరామయ్య, కాండ్ర నారాయణరెడ్డి, పూర్ణచంద్ర, రూపేష్‌రెడ్డి, కుమార్‌రాజా, హషీం పాల్గొన్నారు.

# వివాహ వేడుకలో నేదురుమల్లి



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న నేదురుమల్లి

వెంకటగిరిరూరల్: బాలాయపల్లి మండలం సిద్ధాగుంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత కాల్తిరెడ్డి రాజారెడ్డి కుమార్తె ఝాన్సి, చంద్రారెడ్డిల వివాహ వేడుక పట్టణంలోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో జరిగింది. ఈ వివాహ వేడుకకు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు.

### ఆశీర్వాదం



వివాహ వేడుకలో రాజ్యలక్ష్మి

బాలాయపల్లి (దక్కిలి): మండలంలోని సిద్ధాగుంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత రాజారెడ్డి కుమార్తె ఝాన్సీ వివాహ వేడుకకు నేదురుమల్లి రాజ్యలక్ష్మి బుధవారం హాజరయ్యారు. ఝాన్సీని ఆశీర్వదించారు.

### వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల నూతన కార్యవర్గం

సూళ్లూరుపేట : నాయుడుపేట మండల పరిధిలో అనుబంధ విభాగాల అధ్యక్షుల నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. నాయుడుపేట మండల మహిళ విభాగ అధ్యక్షురాలుగా అత్తికాయల కృష్ణవేణి, రైతు విభాగం మల్లుపట్టు దయాకర్ రెడ్డి, బీసీ సెల్ గోనుపల్లి గురుమూర్తి, ఎస్సీ సెల్ పాశెం చిట్టిబాబు, ఎస్టీ సెల్ బుదూరు శ్రీనివాసులు, మైనారిటీ సెల్ సయ్యద్ కరీముల్లా, చేనేత నల్లు కస్తూరయ్య, పంచాయతీ రాజ్ జలదంకి రాజగోపాల్ రెడ్డి, వైఎస్సార్ టీయూసీ పట్టుకోట రఘు, సేవాదళ్ నల్లారి ప్రకాశం, ప్రచారం చమదం రాజేష్, క్రిస్టియన్ మైనారిటీ పనబాక రవికుమార్‌లను నియమించినట్లు ప్రకటించారు.

# నాయుడుపేటలో బ్యాంక్ ఆఫ్ బరోడా



నూతన శాఖను ప్రారంభిస్తున్న అమర్‌నాథ్‌రెడ్డి

సూళ్లూరుపేట: నాయుడుపేట పట్టణంలో నూతనంగా బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖను ఆ బ్యాంక్ తిరుపతి రీజియన్ ఏజీఎం, రీజనల్ హెడ్ పి.అమర్‌నాథ్‌రెడ్డి బుధవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఏజీఎం మాట్లాడుతూ రాయలసీమ రీజియన్ పరిధిలో నాయుడుపేట 54వ శాఖగా వివరించారు. బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ మేనేజర్, డిప్యూటీ రీజనల్ మేనేజర్ బి.ప్రసాద్, రైతులు, నేతలు పాల్గొన్నారు.

# ముగిసిన పది పరీక్షలు



ఏకొల్లు జిల్లా పరిషత్ పరీక్ష కేంద్రం నుంచి పరీక్ష రాసి ఉత్సాహంగా వస్తున్న విద్యార్థులు

దొరవారిసత్రం: దొరవారిసత్రం బీసీ గురుకుల పాఠశాల, ఏకొల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో పది పరీక్షలు బుధవారంతో ముగిశాయి. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఎస్ఐ తిరుమలరావు పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

### ఆటో బోల్తా

–ముగ్గురికి గాయాలు

సూళ్లూరుపేట రూరల్: ఆటో డివైడర్‌ను ఢీకొని బోల్తాపడిన ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన పెరిమిటిపాడు గ్రామం వద్ద బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన ఏడుగురు సూళ్లూరుపేటలో జరిగే పెళ్లికి ఆటోలో బయలుదేరారు. మార్గ మధ్యలో సూళ్లూరుపేట మండలం పెరిమిటి పాటు గ్రామం వద్ద ఆటో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బుచ్చినాయుడు కండ్రిగకు చెందిన లక్ష్మీనారాయణ, రత్నమ్మ, రామకృష్ణలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని స్థానికులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### నేడు జోగిపల్లిలో విగ్రహ ప్రతిష్ట

సైదాపురం: మండలంలోని జోగిపల్లిలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఆలయంలో పరమశివుని నూతన విగ్రహ ప్రతిష్ట, మహాకుంభాభిషేక మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

# నా బిడ్డను గెలిపించండి

- మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి



నాయుడుపాళెంలో ప్రచారం చేస్తున్న రాజ్యలక్ష్మి

దక్కిలి: వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి ప్రజలను కోరారు. నాయుడుపాళెం, చాకలపల్లి, దక్కిలి, కమ్మపల్లిలో బుధవారం విస్తృతంగా ఆమె పర్యటించారు. అక్కడ నేదరుమల్లి అభిమానులను, వైఎస్సార్‌సీపీ నేతల కుటుంబాలను పరామర్శించి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని, అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం చేకూర్చారని, నాబిడ్డను అత్యధిక మెజారిటీతో గెలపించాలని, తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పి. జగన్‌మోహన్ రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, నేతలు ఎం.నారాయణరెడ్డి, వేణునాయుడు, గోవర్ధన్‌నాయుడు, బండి రమేష్‌రెడ్డి, కోటయ్య నాయుడు, మాధవ్‌నాయుడు, మామిడి శ్రీనివాసులు, ఆర్.చిరంజీవి, కే.వేణుగోపాల్, కాకర్ల సుధాకర్ పాల్గొన్నారు.

# • పరామర్శ



వెంకటరత్నంను పరామర్శిస్తున్న ఎంపీ గురుమూర్తి

పెళ్లకూరు: తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి బుధవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఒబ్బు వెంకటరత్నంను పరామర్శించారు. వెంకటరత్నం సోదరుడు ఒబ్బు పుల్లయ్య(57) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. విషయం తెలిసి ఎంపీ గురుమూర్తి చెంబేడులోని మృతుని నివాసానికి చేరుకుని పుల్లయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీ వెంట సర్పంచ్ ధర్మయ్య ఉన్నారు. అలాగే నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి బుధవారం చిల్లకూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల పిల్లిమిట్ట మురళిని పరామర్శించారు. మురళి తల్లి పిల్లిమిట్ట సుబ్బరత్నమ్మ(80) అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. సత్యనారాయణరెడ్డి మృతురాలి నివాసానికి వెళ్లి ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన వెంట సర్పంచ్ పగడాల హరిబాబురెడ్డి ఉన్నారు.

**నేదురుమల్లి రాజ్యలక్ష్మి పరామర్శ**

వెంకటగిరిరూరల్: మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి బుధవారం పట్టణంలోని పలువురిని పరామర్శించారు. పట్టణానికి చెందిన రిటైర్ ఎస్ఐ సాయిప్రసాద్‌రెడ్డి, రిటైర్డ్ వీఆర్వో టి గోపాల్‌నాయుడు నివాసం వద్దకు చేరుకుని వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

# పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

సూళ్లూరుపేట: మున్సిపాలిటీ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను కమిషనర్ జనార్దన్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలోని 37 పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు ఉండేలా చర్యలు చేపట్టినట్లు కమిషనర్ వెల్లడించారు. ఓటర్ల జాబితాలను సంబంధిత బీఎల్‌ఓలను సంప్రందించి తెలుసుకోవచ్చన్నారు. మున్సిపల్ మేనేజర్ ఎం కే.ఖాజామొహిద్దీన్ పాల్గొన్నారు.

### ఎన్నికల కోడ్ అమలు పరచండి



తల్లంపాడు సచివాలయంలో ఎంపీడీఓ

దొరవారిసత్రం: మండలం పరిధిలోని 11 గ్రామ సచివాలయాల్లోని సిబ్బంది ఎన్నికల కోడ్‌ను అమలు పరచాలని ఎంపీడీఓ శివరాజు తెలిపారు. ఆయన బుధవారం తల్లంపాడు, తనియాలి గ్రామ సచివాలయాలను సందర్శించారు. గ్రామాల్లో, కార్యాలయాల్లో, ఇళ్లపై పార్టీ జెండాలు, పోస్టర్లు లేకుండా సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు.

### ఎన్నికల కోడ్ పాటించాలి



ఎల్లసిరి పాఠశాలలో ఎంసీసీ బృందం

చిట్టమూరు( చిల్లకూరు): ఎన్నికల కోడ్ ఉల్లంగిస్తే సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేస్తామని ఎంసీసీ అధికారులు సూచించారు. ఎల్లసిరి, హిస్టోల్ సెంటర్, జంగాలపల్లి, అద్దెపూడి, కోతలగుంట, అరవపాళెం గ్రామాలలో బుధవారం ఎన్నికల కోడ్ అమలుపై ఆరా తీశారు. ఎంపీడీఓ నాగరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### మౌలిక వసతులపై ఆరా



పారిచెర్లవారిపాళెంలో తహసీల్దార్ శ్రీనివాసులు

చిల్లకూరు: రానున్న ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలలోని ఓటర్ల మౌలిక వసతులపై బుధవారం తహసీల్దార్ శ్రీనివాసులు ఆరా తీశారు. చిల్లకూరు, ముత్యాలపాడు, పారిచెర్లవారిపాళెం, తిక్కవరం గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఎక్కడైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వీఆర్‌ఓ రమణయ్య పాల్గొన్నారు.

### ఎన్నికల విధులపై నిర్లక్ష్యం వద్దు



తడ: సిబ్బందితో తహసీల్దార్ సమావేశం

తడ: ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని తహసీల్దార్, రిటర్నింగ్ అధికారి సయ్యద్ ఇక్బాల్ సిబ్బందిని హెచ్చరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ ఎన్నికల సిబ్బందికి విధులపై దిశా నిర్దేశం చేశారు.

### ప్రశాంత ఎన్నికల నిర్వహణకు చర్యలు



బాలాయపల్లి: మాట్లాడుతున్న తహసీల్దార్

బాలాయపల్లి (దక్కిలి): ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ పుల్లారావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ, ఎస్ఐలతో ఆయన సమీక్షించారు. ఎంపీడీఓ అరుణ, ఎస్ఐ మహబూబ్ సుభాని పాల్గొన్నారు.

### నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి



సైదాపురంలో కవాతు

సైదాపురం: రానున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్ఐ డీఎస్ విజయ్‌కుమార్ కోరారు. ఆయన బుధవారం సాయుధ దళాలతో కలిసి రామసాగరం, సైదాపురం, గిద్దలూరు గ్రామాల్లో కవాతు నిర్వహించారు.

**సూళ్లూరుపేటలో..**

సూళ్లూరుపేట రూరల్: నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ కె.రహీంరెడ్డి పేర్కొన్నారు. కోటపోలూరు, ఆబాక, మన్నేముత్తేరి, జంగాలగుంట గ్రామాల్లో పోలీస్ సిబ్బందితో కవాతు నిర్వహించారు.

# ఎన్నికల విధులపై అవగాహన ఉండాలి



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

సత్యవేడు: శిక్షణలో పొందిన అంశాలు, ఎన్నికల కమిషన్ అందజేసిన నియమావళి పుస్తకాన్ని బాగా చదివి నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. లోక్‌సభ, శాసనసభ సాధారణ ఎన్నికలకు సంబంధించి పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్, అంబేడ్కర్ గురు పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్‌ను బుధవారం సాయంత్రం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కేపీ నరసింహులు (డిప్యూటీ కలెక్టర్, ఏపీఐఐసీ తిరుపతి)తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. అంతకు ముందు దాసుకుప్పం(278, 279), మదనంబేడు పంచాయతీ (266, 267, 268)లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికల్లో బీఎల్‌ఓలు, వీఆర్‌ఓల విధులపై మాక్ పోల్, ఈవీఎం ఆపరేషన్‌పై తీసుకున్న శిక్షణపై ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాల వసతుల వివరాలు తెలుసుకున్నారు. బీఎల్‌ఓలు విధులు, రికార్డుల నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. స్ట్రాంగ్‌రూం గదిలో కిటికీలు, తలుపుల నాణ్యతను పరిశీలించారు. తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీఓ ఎన్.చంద్రశేఖర్, ఎంసీసీ టి.అనిల్ కుమార్, డీటీ రవిచంద్ర, ఆర్ఐ కిరణ్‌కుమార్, వీఆర్‌ఓలు శేఖర్, సురేష్, సుధాకర్ పాల్గొన్నారు.

### రైలు ఢీకొని వృద్ధురాలు దుర్మరణం

తడ: అక్కంపేట రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం రైలు ఢీకొని ఓ గుర్తు తెలియని వృద్ధురాలు దుర్మరణం పాలైంది. సూళ్లూరుపేట జీఆర్‌పీ ఓపీ ఇన్‌చార్జ్ ఎస్ఐ కె.కొండప్పనాయుడు తెలిపిన వివరాల మేరకు.. పచ్చరంగు చీర ధరించిన వృద్ధురాలు రైలు ఢీకొని మృతి చెందినట్టు అందిన సమాచారంతో రైల్వే పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. సంఘటన స్థలంలో వివరాలు సేకరించిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి వయస్సు 65 నుంచి 70 సంవత్సరాల లోపు ఉంటుందని పోలీసులు తెలిపారు.

### కోదండరాముడి బ్రహ్మోత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

తిరుపతి(అలిపిరి): తిరుపతిలోని కోదండరామస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై కోదండరామస్వామి ఆలయంలో అన్ని విభాగాధిపతులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 4న అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 13న చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.